క్లుప్తంగా

నేటి నుంచి ఐడీ ప్రూఫ్ తప్పనిసరి

కందనూలు: ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే మహిళలు తప్పకుండా అడ్రస్ ప్రూఫ్ తప్పనిసరిగా కండక్టర్లకు చూపించాలని నాగర్‌కర్నూల్ ఆర్టీసీ డిపో మేనేజర్ దేవరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్, రేషన్, ఓటర్ కార్డు ఇతర అడ్రస్ ప్రూఫ్ తెచ్చుకోవాలని కోరారు. ప్రయాణికులు సంబంధిత ధృవీకరణ పత్రాలు చూపించి సహకరించాలని పేర్కొన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే



కల్వకుర్తిరూరల్: రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా ఎన్నికైన గడ్డం వరప్రసాద్‌ను గురువారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని శాసనసభ హాల్‌లో ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు.

వెల్దండ: కల్వకుర్తి ఎమ్మెల్యేగా గెలుపొందిన కసిరెడ్డి నారాయణరెడ్డిని గురువారం ఐకేపీ సిబ్బంది హైదరాబాదులో ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. మహిళ సంఘాల రుణాలు, భవనాల వసతులు గురించి వివరించారు. మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మండల మహిళ సంఘం అధ్యక్షురాలు భారతమ్మ, ఏపీఎం రాములునాయక్, సీసీలు, సిబ్బంది ఉన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోండి



చారకొండ: కొత్తగా పట్టాదారు పాసు పుస్తకాలు పొందిన మండల రైతులు యాసంగి రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో రైతుల నుంచి ఆయన దరఖాస్తులను స్వీకరించారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఓ తెలిపారు.

జామె మసీదు ప్రారంభం



చారకొండ: మండలంలోని జూపల్లిలో నూతనంగా నిర్మించిన జామె మసీదును గురువారం మత పెద్దలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం కమిటీ ఆధ్వర్యంలో మసీద్ స్థల దాత రంగినేని వెంకటేశ్వర్ రావు, నితిన్ రావు, నిర్మాణ దాతలు ఖాజామైనోద్దీన్, మొగులాన్, సహకరించిన దాతలను సన్మానించారు. కార్యక్రమంలో వెంకటయ్య యాదవ్, సర్పంచ్ మల్లీశ్వరి, ముస్లింలు ముస్తాఫా, అజీం, కమాలోద్దీన్, అబ్దుల్లా, అక్రం, షబీర్, సాధిక్, యూసుఫ్, తదితరులు ఉన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం



పెంట్లవెల్లి: ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహ యాదవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మండలంలోని సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో డి రవి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సింహనాయుడు, కారంగి ఈశ్వరయ్య, రాజు, నరేష్‌లు పాల్గొన్నారు.

మదర్సా కమిటీ ఫౌండర్ మెంబర్ మృతి

కందనూలు: జిల్లా కేంద్రానికి చెందిన మదర్సే ఇస్లామియా ఫజల్ ఉల్ ఉలూమ్ వ్యవస్థాపక సభ్యుడు సయ్యద్ షహాబుద్దీన్ (90) గురువారం మృతి చెందాడు. వయోభారంతో అస్వస్థతకు గురై మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అరబీ పాఠశాల కమిటీ బాధ్యులు అబ్దుల్లా ఖాన్, సయ్యద్ రఫీ యుద్దీన్ తదితరులు ఆయన సేవలను గుర్తుచేశారు.

దశాబ్దం గడిచినా..

- అద్దెభవనాల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న తహసీల్దార్ కార్యాలయం



వాల్మీకి భవనంలో కొనసాగుతున్న పోలీస్‌స్టేషన్

పెంట్లవెల్లి: మండలంలో దాదాపు 10 సంవత్సరాలుగా ప్రభుత్వ కార్యాలయాలు ఇంకా అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ప్రతి సంవత్సరం నూతన భవనాలకు కృషి చేస్తామంటూ అధికారులు ఇటు నాయకులు తెలియజేస్తున్నా.. అవి అమలుకు సాధ్యం కావడంలేదు. ముఖ్యంగా తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ కార్యాలయం, మహిళ సంఘం కార్యాలయం ఇలా ఎన్నో కార్యాలయాలు అద్దె భవనాల్లోనే అధికారులు కాలం గడుపుతున్నారు. కొంతమంది కుల సంఘాల ప్రజలు నూతన మండలం ఏర్పడిందని సంతోషంతో వారి కమ్యూనిటీహాల్‌లో కొద్ది రోజులు మాత్రమే ఉంటారేమోనని ఇస్తే ఏకంగా అధికారులు మాత్రం సంవత్సరాలుగా తరబడి ఉన్నారని వాపోతున్నారు. మా కమ్యూనిటీ హాల్ మాకు ఇవ్వాలని ఎన్నోమార్లు వాల్మీకి, వడ్డెర సంఘాల నాయకులు అధికారులను కోరుతున్నారు. భవనాలు ప్రభుత్వానికి ఇచ్చి మేము ఇబ్బంది పడాల్సి వస్తుందని కుల సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, రాజకీయ నాయకులు స్పందించి నూతన భవనాల ఏర్పాటుకు స్థల పరిశీలన చేసి, వెంటనే భవనాల నిర్మాణ ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజలు, కుల సంఘాల నాయకులు కోరుతున్నారు.

మా భవనాలు మాకు ఇవ్వండి



మండలం ఏర్పడి 10 సంవత్సరాలు గడుస్తున్నా.. ఇంకా ప్రభుత్వ కార్యాలయాలు ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్నాయి. మా భవనాలు మాకు తిరిగి ఇవ్వాలి. అధికారులు, నాయకులు చర్యలు చేపట్టి సొంత భవనాల ఏర్పాటుకు కృషి చేయాలి.

– రాజు, పెంట్లవెల్లి

స్థల పరిశీలన చేపట్టాం..



గతంలో ఉన్న తహసీల్దార్లు పలు సర్వే నంబర్‌లో ప్రభుత్వ కార్యాలయాల కోసం స్థల పరిశీలన చేపట్టాం. పైఅధికారుల ఆదేశాల మేరకు ఆ వివరాలను అధికారులకు పంపించాం. ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే వెంటనే నూతన భవనాల ఏర్పాటుకు కృషి చేస్తాం.

–జమీల్, తహసీల్దార్, పెంట్లవెల్లి

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు



చారకొండ మండలం తిమ్మాయిపల్లిలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ చిన్న హుస్సేన్

చారకొండ: సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు పొందవచ్చని మండల వ్యవసాయ అధికారి చిన్న హుస్సేన్ అన్నారు. మండలంలోని తిమ్మాయిపల్లిలో గురువారం ఏఈఓతో కలిసి ఆయన వేరుశనగ పంటలను పరిశీలించారు. ఈసందర్భంగా ఏఓ మాట్లాడుతూ పంటలో ఆశించే తెగుళ్ల నివారణ, సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. పంట దిగుబడికి పలు సూచనలు, సలహాలు అందించారు. అధికారుల సూచనల మేరకు రసాయనిక ఎరువులు వాడాలని సూచించారు. వారి వెంట రైతులు లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

తెగుళ్ల నివారణపై అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని గేమ్యానాయక్ తండా, లచ్చనాయక్ తండాల్లో మినుము, వేరుశనగ పంటలను గురువారం మండల వ్యవసాయ అధికారి నాగరాజు, ఏఈఓలు మోహన్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినుము పంటలో కాండపు ఈగ ఉధృతి అధికంగా ఉందని దీని నివారణకు ఫ్రిప్రోనిల్ లేదా రోగోర్ లేదా క్లోరోపైరి ఫాస్ వాడాలన్నారు. బూడిత తెగుళ్ల నివారణకు ఇండెక్స్ లేదా నాటినో పిచికారి చేయాలని రైతులకు సూచించారు. వేరుశనగలో వచ్చే మచ్చ తెగులు నివారణకు హెక్సకొనజోల్ లేదా ఫాలిక్యూర్ పిచికారి చేయాలని వివరించారు. అదే విధంగా వరి కొనుగోలు కేంద్రాలను సందర్శించి పరిశీలించారు.

ఎమ్మెల్యేకు సన్మానం



కల్వకుర్తిరూరల్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిని గురువారం బ్లాక్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు.

ఎమ్మెల్యేను కలిసిన ఇంజనీరింగ్ అధికారి

తాడూరు: ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిని గురువారం ఇంజనీర్ అసోసియేషన్ ఇరిగేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన అసిస్టెంట్ల ఇంజనీర్ల సమస్యలపై చర్చించారు. అర్హులైనవారికి ప్రమోషన్లు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఆటో డ్రైవర్లకు ప్రత్యామ్నాయం చూపించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కారణంగా ఆటోడ్రైవర్లు రోడ్డున పడ్డారని దీంతో వారికి జీవన ఉపాధి కోసం ప్రత్యామ్నాయం చూపించాలని తెలంగాణ పబ్లిక్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ పెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి, కార్యదర్శి పాదిల రామయ్యలు డిమాండ్ చేశారు. గురువారం ఆటో యూనియన్ నాయకులతో ఏర్పాటు సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 50 లక్షల మంది రవాణా రంగ కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారన్నారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. సంవత్సరానికి రూ.12 వేలు చెల్లిస్తామని హామీ ఇచ్చారని ఇది వెంటనే అమలు చేయాలన్నారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయాన్ని ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆటో రంగాల యూనియన్ నాయకులు చింతకాయల శివ, మల్లేష్, సైదులు, మహేష్, సుబ్బయ్య, సుల్తాన్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

కోర్టు ఆవరణలో తాగునీటి ట్యాంకు ఏర్పాటు

కొల్లాపూర్: పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన తాగునీటి ట్యాంక్‌ను గురువారం మెజిస్ట్రేట్లు ఆర్‌వీఎస్ఎస్ మిధున్‌తేజ, జ్యోత్స్న గుంటిలు ప్రారంభించారు. కోర్టుకు వచ్చే కక్షిదారులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.వసంతరెడ్డి, న్యాయవాదులు, సిబ్బంది ఉన్నారు.



తాగునీటి ట్యాంకు ప్రారంభిస్తున్న జడ్జిలు ఆర్‌వీఎస్ఎస్ మిధున్‌తేజ, జ్యోత్స్న

అధికార కార్యక్రమంలో కౌన్సిలర్ భర్తదే పెత్తనం



మాట్లాడుతున్న కలెక్టర్ ఉదయ్‌కుమార్ (ఇన్‌సెట్లో కూర్చున్న కౌన్సిలర్ భర్త బాలరాజు)

అచ్చంపేట రూరల్: మహిళలకు రాజకీయాల్లో ప్రాతినిధ్యం లభిస్తున్నా.. పురుషాధిక్య ప్రపంచంలో చెల్లుబాటు కావడం లేదు. ఇందుకు నిదర్శనమే అచ్చంపేటలో గురువారం చోటుచేసుకున్న ఘటన. అచ్చంపేటలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో గురువారం గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు జోనల్ స్థాయి క్రీడా పోటీలను నిర్వహించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ ఉదయ్‌కుమార్ హాజరయ్యారు. అక్కడి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆర్డీఓ, తహసీల్దార్, ఎంఈఓ, మున్సిపల్ చైర్మన్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి, సీఐ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అయితే స్థానిక రెండో వార్డు కౌన్సిలర్ సుంకరి నిర్మలకు బదులుగా ఆమె భర్త బాలరాజు పాల్గొన్నారు. కలెక్టర్ సమక్షంలోనే భార్య స్థానంలో భర్త అధికారిక కార్యక్రమంలో పాల్గొనడంపై చర్చనీయాంశంగా మారింది.

వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



పెంట్లవెల్లి: మండల కేంద్రంతో పాటు తడకలవారి తండాలో మండల ఐకేపీ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు సువర్ణమ్మ, పార్వతమ్మలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు పండించిన వరిధాన్యాన్ని పూర్తి స్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని పేర్కొన్నారు. ఏ గ్రేడ్‌రకం రూ.2203, బీ గ్రేడ్ రూ.2183 లకు కొనుగోలు చేస్తుందని వివరించారు. గోపాల్, కోట్ల సురేందర్, రామన్‌గౌడ్, ఏపీఎం గౌసుద్దీన్, ఎర్ర శ్రీను, రేణు, నరేష్, బోర్‌వెల్ రాములు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మలుపులు



చర్లతిరుమలాపురంకు వెళ్లే దారిలో ఉన్న మలుపు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాలకు వెళ్లే లింక్ రోడ్లు ప్రమాదకరంగా మారాయి. ఎక్కడపడితే అక్కడ మలుపులు ఉండటంతో వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారు. మలుపుల వద్ద ఆర్‌అండ్‌బీ అధికారులు ఎలాంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చర్లిటిక్యాల నుంచి చర్లతిరుమలాపూర్ మీదుగా జిల్లా కేంద్రానికి వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు, తుమ్మలసూర్, ఇంద్రకల్, ఐతోల్, శిర్సవాడ వెళ్లే ప్రధాన రోడ్లు అధికంగా మలుపులు ఉన్నాయి. అధికారులు పరిశీలించి తాత్కాలిక రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఓటురుగా నమోదు చేసుకోవాలి

ఊర్కొండ: యువత ఓటురుగా నమోదు చేసుకోవాలని మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ మోహన్ రావు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024 జనవరి 1 వరకు 18 సంవత్సరాల నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. జనవరి 5వ తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు. అడ్రస్, ఫొటో, ఫోన్ నెంబర్ లింక్ తప్పు ఒప్పులు సరిచేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చెన్న కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

నర్సరీ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ

కల్వకుర్తిరూరల్: నర్సరీ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఎంపీడీఓ ఆంజనేయులు అన్నారు. గురువారం పట్టణంలోని ఉపాధిహామీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. నర్సరీలో మొక్కల పెంపకం, ఉపాధి హామీలో కూలీల సంఖ్య పెంచడంతోపాటు ఇంటి పన్నులు వసూలు, ఇతర అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. మండల పరిషత్ అధికారి దేవేందర్, ఏపీఓ చంద్రసిద్దార్థ్, కార్యదర్శులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఆంజనేయులు

పల్లెప్రకృతి వనాలను సంరక్షిద్దాం



కోనాపూర్‌లో నర్సరీని పరిశీస్తున్న ఎంపీడీఓ

వంగూరు: గ్రామాల్లో ఉన్న పల్లెప్రకృతి వనాలను సంరక్షిద్దామని ఎంపీడీఓ విజయభాస్కర్ అన్నారు. గురువారం మండలంలోని పోల్కంపల్లి, కోనాపూర్. రంగాపూర్ గ్రామాల్లో ఉన్న నర్సరీలను, పల్లెప్రకృతి వనాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మొక్కల పెంపకం ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. హరితహారంలో నాటిన మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు నర్సరీ నిర్వాహకులకు సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. నర్సరీ నిర్వహణపై నిర్లక్ష్యం వహించొద్దని హెచ్చరించారు. ఆయన వెంట కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల పక్షాన నిలబడతాం

కొల్లాపూర్: నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం ప్రజల పక్షాన ఉంటూ పోరాడుతామని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల అనంతరం ఆయన తొలిసారిగా గురువారం పట్టణంలో నిర్వహించిన పార్టీ నాయకుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మాట్లాడారు. సోమశిల బ్రిడ్జి, జాతీయ రహదారి మంజూరు చేయించానని పేర్కొన్నారు. కొల్లాపూర్‌కు హార్టికల్చర్ పాల్‌టెక్నిక్ కళాశాల, పెద్దకొత్తపల్లికి జూనియర్ కళాశాలలు తీసుకొచ్చానన్నారు. ఇటీవల కాలంలో కొందరు రాజకీయ కక్షతో ఇళ్లలోకి చొరబడి దాడులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది మంచి పద్ధతి కాదని కాంగ్రెస్ నాయకులకు సూచించారు. సమావేశంలో రంగినేని అభిలాష్‌రావు, రాంచందర్‌యాదవ్, డీకే.మాదిగ, కృష్ణమూర్తి, శంకర్‌నాయక్, సునీల్‌నాయక్, గుజ్జుల పరమేష్‌తో పాటు పలువురు ఉన్నారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు

పెద్దకొత్తపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమితో కార్యకర్తలు అధైర్యపడొద్దని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని సాతాపూర్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల తీర్పును అందరు గౌరవించాలన్నారు. ఎన్నికల్లో గెలుపు, ఓటమిలు సహజమని వివరించారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుదామని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో ప్రజా ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. ఎన్నికల్లో తనకు మద్దతుగా నిలిచిన నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అభిలాష్‌రావు, రాజేందర్‌గౌడ్, వెంకటయ్య, నర్సింహ, పరమేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి

పరామర్శ

కోడేరు: మండలంలోని నాగులపల్లి తండాకు చెందిన బిక్నీ ముగ్గురు పిల్లలతో హైదరాబాద్ వెళ్తుండగా ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి వారిని పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట రంగినేని అభిలాష్‌రావు ఉన్నారు.

17 నుంచి రామాలయంలో ప్రత్యేక పూజలు

కందనూలు: జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఈ నెల 17 నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస ప్రత్యేక పూజలు నిర్వహిస్తునట్లు రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు తెల్లవారుజామున 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు తిరువారాధన, 6గంటలకు తిరుప్పావై,పాశురం పఠనం, 6.30 గంటలకు సామూహిక సంకీర్తన భజన ఉంటుందని పేర్కొన్నారు.

అసంపూర్తిగా డ్రెయినేజీ నిర్మాణాలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల సమీపంలో అసంపూర్తి డ్రెయినేజీ నిర్మాణంతో మురుగు వాసనతో ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు, సమీప ఇళ్ల యజమానులు వాపోతున్నారు. గతంలో ఉన్న డ్రెయినేజీ ధ్వంసమైందని దానియొక్క రాయిని తొలగించి డ్రెయినేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో మురుగు సక్రమంగా ముందుకు వెళ్లక అక్కడే నిల్వ ఉంటుందన్నారు. అధికారులు, పంచాయతీ వారు స్పందించి ఇబ్బందులు తొలగించాలని వాపోతున్నారు.

స్వామియే శరణం అయ్యప్ప



పాదయాత్రగా వెళ్తున్న అయ్యప్ప మాలధారులు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో గురువారం అయ్యప్ప మాలధారులు భక్తి శ్రద్ధలతో ఇరుముడి కట్టుకున్నారు. గురుస్వాములు దమ్మోజు మురళి, మొకురాల రమేష్‌గౌడ్, గానోజు వెంకటరమణ, కాకునూరి రవి, వెన్ను భాను, వనం శ్రీనుతో పాటు 18 మంది స్వాములు శబరిమలకు పాదయాత్రగా బయలుదేరారు. అచ్చంపేట అయ్యప్పస్వామి శరణుఘోషతో మారుమ్రోగింది. మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, కౌన్సిలర్ గౌరీశంకర్, మండికారి బాలాజీ, వెంకటేష్, ప్రమోద్‌ప్రసాద్, మహేష్‌చారి, రవీందర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి పూజలు

కొల్లాపూర్: పట్టణంలోని ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయంలో గురువారం ఇరుముడి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అయ్యప్ప మాలధారులు ఇరుముడిని ధరించి శబరిమలైకి బయలుదేరారు. భజనకీర్తనలు పాడుతూ నృత్యాలు చేస్తూ పరవశించిపోయారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు వంగ రాజశేఖర్‌గౌడ్, హాజరయ్యారు.